సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 8 । అక్టోబర్ । 2024



కారుణ్య గ్రహణం

61 ఏళ్లు దాటిన వీఆర్‌ఏలు తమ వారసులను నియమించాలని కోరుతున్నారు.

వివరాలు 10లో ▸



పండుగ పూట విషాదం

న్యాల్‌కల్ మండల పరిధిలోని గణేశ్‌పూర్ గ్రామంలో పండుగ పూట విషాదం నెలకొంది.

వివరాలు 10లో ▸



అధికారులపై ఆగ్రహం

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ క్రాంతి హెచ్చరించారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

దసరా ఉత్సవాలకు రండి

మంత్రి దామోదరకు దత్తగిరి పీఠాధిపతి ఆహ్వానం



మంత్రికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న పీఠాధిపతి

ఝరాసంగం(జహీరాబాద్): జిల్లాలో ఆధ్యాత్మిక క్షేత్రంగా భాసిల్లుతున్న బర్దీపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో నిర్వహించే విజయదశమి దుర్గాదేవి ఉత్సవాలకు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావులకు ఆహ్వాన పత్రికలను అందించారు. సోమవారం ఆశ్రమ పీఠాధిపతి డా.సిద్ధేశ్వర్ స్వామి హైదరాబాద్‌లో వేర్వేరుగా కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వానించారు.

భెల్ కార్మికుల సమస్యలను పరిష్కరించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ కార్మికులకు అండగా ఉండి వారి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సోమవారం భెల్ టౌన్‌షిప్‌లో కొద్ది రోజుల క్రితం యువకుల దాడిలో గాయపడిన భెల్ కార్మికుడు కార్తీక్‌చంద్ర మహాపత్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. భెల్ యాజమాన్యం కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్మికుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుడో పోటీలకు తండ్రీకొడుకులు



కుమారుడు కార్తీక్‌రెడ్డితో ఎం.జైపాల్‌రెడ్డి

జహీరాబాద్: ఈనెల 14వ తేదీన చైనా దేశంలోని బీజింగ్‌లో జరగనున్న ప్రపంచ స్థాయి సుడోకు పజిల్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొనేందుకు జహీరాబాద్‌కు చెందిన తండ్రీకొడుకులు ఎం.జైపాల్‌రెడ్డి, ఎం.కార్తీక్‌రెడ్డి మన దేశం తరపున ఎంపికయ్యారు. మాజీ ఎంపీ ఎం.బాగారెడ్డి తనయుడు అయిన డీసీసీబీ మాజీ చైర్మన్ ఎం.జైపాల్‌రెడ్డి గతంలోనూ కొడుకుతో కలిసి ప్రపంచ సుడోకు పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటుకున్నారు. మరోమారు ప్రపంచ స్థాయి పోటీల్లో తమ తెలివి తేటలను ఉపయోగించి ప్రతిభను చాటుకోనున్నారు. చిన్ననాటి నుంచి పజిల్ పోటీలపై జైపాల్‌రెడ్డికి మక్కువ ఉండేది. 2007లో మన దేశంలో రీజియన్ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. 2008 నుంచి మన దేశం తరపున అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. అప్పటి నుంచి రెగ్యులర్‌గా సుడోకు పోటీల్లో పాల్గొంటున్నారు.

ముగ్గురికి ఎంబీబీఎస్ సీట్లు



సిర్మా అఖిల



ఘుల్లే ప్రవీణ్



పద్వాల్ జీవన్ సింగ్

కంగ్టి(నారాయణఖేడ్): పేద సన్నకారు రైతుల ఇంట్లో విద్యా కుసుమాలు వెల్లివిరిశాయి. ఇటీవల జరిగిన నీట్ అర్హత పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి కంగ్టి మండలంలో ముగ్గురు విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించారు. కంగ్టి గ్రామానికి చెందిన సిర్మా అఖిలకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ మంచిర్యాలలో సీటు రాగా, తుర్కవడ్‌గాం గ్రామానికి చెందిన ఘులే ప్రవీణ్‌కు జీఎంసీ మహబూబాబాద్‌లో, తడ్కల్ ఎడ్లరేగడి తండాకు చెందిన పద్వాల్ జీవన్‌సింగ్‌కు జీఎంసీ నల్గొండలో సీట్లు దక్కాయి. ప్రైవేట్ కాలేజీల్లో ఫీజులు చెల్లించే స్థోమత లేని కుటుంబాల నుంచి మంచి ర్యాంకులు సాధించి ప్రభుత్వ కాలేజీల్లో సీట్లు పొందడంపై కుటుంబీకులతోపాటు స్థానికులు అభినందనలు తెలిపారు.

మంజీరా జలాలు సాగుకు అందించాలి

నారాయణఖేడ్: సాగుకు మంజీరా జలాలను అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాయిలు, మాణిక్ డిమాండ్ చేశారు. పార్టీ ద్వితీయ మహాసభలు సోమవారం పట్టణంలో నిర్వహించారు.

లలితా పరమేశ్వరిగా..



సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్ పేట దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారు సోమవారం లలితా పరమేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. – సంగారెడ్డి టౌన్:



మహాలక్ష్మి దేవిగా..

శ్రీ కేతకి సంగమేశ్వర ఆలయంలో సోమవారం మహాలక్ష్మి దేవిగా దుర్గామాత దర్శనమిచ్చారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో విశేష అలంకరణ, విఘ్నేశ్వర పూజ, చతుష్టి సహిత ఆభరణార్చనలు, లలిత హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. – ఝరాసంగం(జహీరాబాద్):

స్కందమాతగా దుర్గమ్మ



ఏడుపాయల వన దుర్గా భవాని మాత సోమవారం స్కందమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఐదోరోజు అమ్మవారిని పెసర రంగు వస్త్రాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పూజలో పాల్గొన్నారు. పాపన్నపేట(మెదక్):

అందుబాటులోకి అత్యవసర చికిత్స



జాతీయ రహదారులపై ట్రామాకేర్ సెంటర్లు

- గుమ్మడిదల సెంటర్‌కు అంచనాలు సిద్ధం
- కంకోల్ సెంటర్ కోసం స్థల అన్వేషణ
- ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి దామోదర

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలో జాతీయ రహదారులు నెత్తురోడుతున్నాయి. తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో రక్తసిక్తం అవుతున్నాయి. క్షతగాత్రులకు సరైన సమయంలో ఆసుపత్రులకు చేర్చలేకపోవడంతో విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు జాతీయ రహదారులపై ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వైద్యారోగ్యశాఖ నిర్ణయించింది. ప్రమాదం జరిగిన వెంటనే వీలైనంత త్వరగా ఈ ట్రామాకేర్ సెంటర్‌కు తరలిస్తే అక్కడ ఉన్న అధునాత వైద్య సదుపాయాలు, ఆర్థో, న్యూరో తదితర విభాగాలకు చెందిన వైద్యనిపుణులు అందుబాటులో ఉండటంతో ప్రాణాలను కాపాడవచ్చు. ఇలాంటి ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు జిల్లాలో అడుగులు పడుతున్నాయి.

గుమ్మడిదలలో రూ.56 కోట్లతో..

హైదరాబాద్ నుంచి మెదక్ వైపు వెళ్లే 765(డి) జాతీయ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గాయాల పాలైన వారిని ఆసుపత్రికి తరలించాలంటే గంటల తరబడి సమయం పడుతోంది. దీంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు గుమ్మడిదలలో ఈ ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ ట్రామాకేర్ సెంటర్‌తో పాటు, వంద పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలనే భావిస్తున్నారు. ఈ ట్రామాకేర్ సెంటర్, ఆసుపత్రి భవనాలు, అందులో ఉన్న ఎక్విప్‌మెంట్ ఇలా అన్నీ కలిపి సుమారు రూ.56 కోట్లతో వైద్యారోగ్యశాఖ అంచనాలు సిద్ధం చేసింది. ఈ అంచనాలు ఇటీవల ప్రభుత్వానికి పంపారు.

కంకోల్ వద్ద మరో కేంద్రానికి స్థల పరిశీలన

మునిపల్లి మండలం కంకోల్ వద్ద కూడా ఓ ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు. 65 నంబర్ జాతీయ రహదారి ముంబై హైవేపై కంకోల్ టోల్‌గేట్ సమీపంలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తే బాగుంటుందని భావిస్తున్నారు. జహీరాబాద్ ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగితే గాయాల పాలైన వారికి సంగారెడ్డికి గానీ, హైదరాబాద్‌కు తరలించాలంటే సుమారు మూడు గంటలకు పైగా సమయం పడుతోంది. దీంతో మార్గమధ్యలోనే ప్రాణాలు పోతున్నాయి. కంకోల్ టోల్‌గేట్ సమీపంలో ఈ కేంద్రం ఏర్పాటు చేస్తే ఇలాంటి వారికి మేలు జరుగుతుందని భావిస్తున్నారు. ఈ ట్రామాకేర్ సెంటర్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నారు. త్వరలో ఖరారయ్యే అవకాశం ఉంది.

నాందేడ్ హైవేపై..

నాందేడ్ హైవే 161పై కూడా ఈ సెంటర్‌ను ఏర్పాటు పరిశీలనలో ఉంది. జోగిపేట్ సమీపంలో ఏర్పాటు చేస్తే నారాయణఖేడ్ నుంచి సంగారెడ్డి వరకు సెంటర్ పాయింట్ అవుతుందని భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో కూడా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసే యోచనలో ఉన్నారు.

జిల్లాలో ప్రస్తుతం ఎక్కడా లేవు

జిల్లాలో ప్రస్తుతం ఈ ట్రామాకేర్ సెంటర్లు ఎక్కడా లేవు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఈ ట్రామాకేర్ ఉండాల్సిన ఆధునిక వైద్య పరికరాలు, ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రత్యేకమైన ఈ ట్రామాకేర్ సెంటర్ లేదు. ఈ సెంటర్లను ఏర్పాటు చేస్తే జిల్లాకు చాలా మటుకు మేలు జరుగుతుంది.

మంత్రి ప్రత్యేక చొరవ

జిల్లాలో ఈ ట్రామాకేర్ సెంటర్ల ఏర్పాటుకు మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. వైద్యారోగ్యశాఖకు ఆయనే ప్రాతినిధ్యం వహిస్తుండటంతో తన శాఖకు సంబంధించిన వైద్య సంస్థలను జిల్లాలో నెలకొల్పేందుకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ.. అంచనాలను సిద్ధం చేయిస్తున్నారు. ఈ ట్రామాకేర్ సెంటర్లు అందుబాటులోకి వస్తే రోడ్డు ప్రమాదాల్లో నిత్యం పదుల సంఖ్యలో క్షతగాత్రులవుతున్న వారి విలువైన ప్రాణాలు దక్కే అవకాశాలు ఉన్నాయి.

జిల్లా పరిధిలోని నేషనల్ హైవేలపై జూన్ వరకు జరిగిన రోడ్డు ప్రమాదాలు ఇలా..

రహదారి	రోడ్డు ప్రమాదాలు	మరణాలు	క్షతగాత్రులు
ఎన్‌హెచ్–161	48	23	68
ఎన్‌హెచ్–65	160	65	175
ఎన్‌హెచ్–765	15	3	13

ఆ బాధ్యత అధికారులదే

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ



ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరిస్తున్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, తదితరులు

సంగారెడ్డి జోన్: గ్రామాలలో ప్రజల సమస్యలను పరిష్కరించే బాధ్యత సంబంధిత శాఖ అధికారులదేనని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు సంబంధిత శాఖ అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు తక్షణమే పరిష్కరించి, ఆన్ లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. జిల్లాలోని వసతి గృహాలను ఆకస్మిక తనిఖీలు చేపట్టాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజరాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



నా పేరు సబిత. కోహిర్ మండల పరిధిలోని బడంపేట్ గ్రామం. మూడేళ్ల క్రితం రెండు కండ్లు పోయాయి. అప్పటి నుంచి చూపు కనిపించడం లేదు. పింఛన్ ఇప్పించాలని పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే తగు చర్యలు తీసుకొని పింఛన్ అందే విధంగా చూడాలి.

–సబితా, బడంపేట్, కోహిర్ (మం)

పింఛన్ ఇప్పించండి



నా పేరు గాలయ్య. చౌటకూర్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామం. వికలాంగుడైన నాకు పింఛన్ అందటం లేదు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకొని పింఛన్ అందే విధంగా చూడాలి.

–గాలయ్య, లింగంపల్లి, చౌటకూర్ (మం)

అధికారులపై చర్యలు తీసుకోవాలి



నా పేరు పద్మమ్మ. కొండాపూర్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామం. మా పట్టా భూమిలో గ్రామపంచాయతీ అధికారులు దౌర్జన్యంగా తాగునీటి బోరు వేశారు. అధికారులు తమపై వివిధ రకాలుగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–పద్మమ్మ, మారేపల్లి, కొండాపూర్ (మం)

శాశ్వత పనులకు ప్రాధాన్యతనివ్వాలి

- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి
- ఉపాధి పనులపై పీడీతో కలిసి సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథంలో భాగంగా ప్రజలకు ఉపయోగపడేలా శాశ్వతపనులను చేపట్టాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎస్‌ఆర్‌ఈజీఎస్ పీడీ జ్యోతిలక్ష్మి ఉపాధిహామీ పథకం అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, ఉపాధిహామీ పథకం ఏపీఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటివరకు చేపట్టిన పనుల్లో చెరువులలో పూడికతీత తప్ప వేరే పనులకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. చేసిన పనుల్లో 70 శాతం పనులన్నా ప్రజలకు కనిపించాలని కోరారు. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని సూచించారు. నీటికుంటలు, నీటిసంరక్షణ, మొక్కలు, పండ్లతోటల పెంపకం, గ్రామాలకు మట్టిరోడ్లు, చెక్‌డ్యాంల నిర్మాణం తదితర పనులకు ప్రాధాన్యతనివ్వాలని ఆయన సూచించారు. రోడ్లు, చెక్‌డ్యాంల నిర్మాణం విషయంలో అవసరమైతే ఎమ్మెల్యే కోటా నిధులను కేటాయిస్తానన్నారు. పెద్ద పట్టణాల్లో మొక్కల పెంపకంతో పార్కుల తరహాలో అభివృద్ధి చేయాలని, కిచెన్‌గార్డెనింగ్‌కు మొక్కలు అందించాలని సూచించారు. ఎంపీడీఓలు నిత్యం తనిఖీలు చేయాలని పీడీ జ్యోతిలక్ష్మి సూచించారు. కూలీల హాజరు, పనులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. పనులకు సంబంధించి డబుల్ ఎంట్రీ చేస్తే క్రిమినల్ కేసులు నమోదవుతాయని హెచ్చరించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కార్యాలయాల్లో కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు.



బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న అధికారులు

పోలీసు కుటుంబాల బతుకమ్మ సంబురాలు

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగ సంబురాలు ఘనంగా జరుపుకొన్నారు. ఆదివారం రాత్రి సంగారెడ్డిలో నిర్వహించిన వేడుకల్లో పోలీసు అధికారులు కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలను జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ చెన్నూరి రూపేష్, అడిషనల్ ఎస్పీ సంజీవరావు, తదితరులు పాల్గొన్నారు. – సంగారెడ్డి జోన్:

‘డ్రాగన్’ ఫ్రూట్ సాగు విస్తరణ!

- ఫ్రూట్ రీసెర్చ్ సెంటర్ ప్రత్యేక కార్యాచరణ
- నేడు సంగారెడ్డిలో మేళా
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 500 ఎకరాల్లో పంట సాగు
- రైతులు, విద్యార్థులకు అవగాహన



రంజోల్‌లో సాగులో ఉన్న డ్రాగన్‌ఫ్రూట్ పంట



చెట్టుకు కాసిన పండ్లు

జహీరాబాద్: డ్రాగన్ ఫ్రూట్ పంట సాగు విస్తరించేందుకు వీలుగా ఫ్రూట్ రీసెర్చ్ సెంటర్ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. రైతులు, ప్రజలు, విద్యార్థులకు డ్రాగన్ ఫ్రూట్ ఉపయోగాల గురించి అవగాహన కల్పించనున్నారు. మంగళవారం సంగారెడ్డిలోని ఎఫ్‌ఆర్‌సీలో మేళా నిర్వహించనున్నారు. పంట సాగు వల్ల రైతులు ఏ మేరకు లబ్ధి పొందవచ్చనేది మేళాలో వివరిస్తారు. పంట సాగు భారీ ఖర్చుతో కూడుకున్నప్పటికీ లాభాలు సైతం అదే స్థాయిలో ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. మార్కెట్లో డ్రాగన్ ఫ్రూట్ పండ్లకు మంచి డిమాండ్ ఉందని, రైతులు సాగు పట్ల ఆసక్తి పెంచుకుని దీర్ఘకాలం పాటు లాభాలు పొందాలని సూచిస్తున్నారు.

500 ఎకరాల్లో పంట సాగు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రస్తుతం 500 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ పంట సాగులో ఉంది. జహీరాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, గజ్వేల్, నారాయణఖేడ్, దుబ్బాక, నర్సాపూర్ ఈ మేరకు పంట సాగులో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పంట సాగు కోసం ఎకరాకు సుమారు రూ.5లక్షల మేర వ్యయం చేయాల్సి ఉంటుంది. రెండో ఏటా నుంచి పంట చేతికి అంది వస్తుందని, ఇది సుమారు 20 సంవత్సరాల పాటు పంట దిగుబడులను ఇస్తుందని అధికారులు చెబుతున్నారు. రెండో సంవత్సరం ఎకరాకు 5 టన్నుల దిగుబడి వస్తోందని, మధ్య కాలంలో 15 టన్నులకు పెరుగుతుందని పేర్కొంటున్నారు. చివరి కాలంలో మరింత దిగుబడి పెరుగుతుందని వివరిస్తున్నారు. మంచి ధర ఉండడం వల్ల మంచి లాభాలను పొందవచ్చని చెబుతున్నారు.

సాగులో ఇబ్బందులు



డ్రాగన్ ఫ్రూట్ పంట సాగులో ఇబ్బందులు ఉన్నాయి. రస్ట్ ఫంగస్ రావడం వల్ల నష్టాలు వస్తున్నాయి. పంట వేసుకున్నాక నాలుగేళ్లకు ఈ ఫంగస్ సోకుతోంది. దీంతో పంటను కాపాడుకోలేని వారు పంటను తొలగిస్తున్నారు. ఫలితంగా పెట్టుబడులు రాక నష్టాలను చవిచూస్తున్నారు. కొత్త వారు పంట సాగు పట్ల ఆసక్తి చూపుతున్నారు. దీంతో పంట సాగు బ్యాలెన్స్‌గా ఉంటోంది. పంటను రోగాల బారి నుంచి కాపాడుకున్నట్లయితే ఇతర పంటల కంటే మంచి లాభాలను పొందవచ్చు. నేను 7 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నా. మంచి లాభాలు వస్తున్నాయి.

–రమేష్‌రెడ్డి, రైతు, రంజోల్

సాగును ప్రోత్సహించేందుకే..

రైతులు డ్రాగన్‌ఫ్రూట్ సాగు పట్ల ఆసక్తి పెంచుకునేందుకు గాను అవగాహన కల్పించనున్నాం. అవగాహన వచ్చాకే సాగు పట్ల రైతులు ముందుకు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఈ పండులో ఉండే పోషకాలు, సాగులో లోటు పాట్లు, మార్కెటింగ్ తదితర వాటిపై సంస్థ ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుంది. మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

–సుచిత్ర, ఎఫ్‌ఆర్‌ఎస్ సీనియర్ శాస్త్రవేత్త, సంగారెడ్డి

మార్కెట్లో డిమాండ్

డ్రాగన్ ఫ్రూట్ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. రైతుల వద్ద వ్యాపారులు కిలో రూ.100 నుంచి రూ.150 వరకు కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు మాత్రం ఒక్కో పండును విడిగా విక్రయించుకుంటున్నారు. మార్కెట్లో డిమాండ్‌ను బట్టి ఒక్కో పండును రూ.80 నుంచి రూ.100 ధరకు విక్రయిస్తున్నారు.

ఏక కాలంలోనే పంట దిగుబడులు

పంట రైతులందరి వద్ద ఏక కాలంలోనే చేతికి అందివస్తుంది. దీంతో మార్కెట్లోకి ఒకేసారి రావడం వల్ల ధరపై ప్రభావం చూపుతోంది. పంటను స్టోరేజ్ చేసుకోవడం ద్వారా మంచి ఫలితం ఉంటుందని రైతులు అంటున్నారు. ఏడాదిలో ఐదు నుంచి ఆరు మార్లు మాత్రమే పంట కోతకు వస్తుంది. నెల వ్యవధిలో పంట కోతకు వస్తుందని రైతులు వివరిస్తున్నారు.

క్లుప్తంగా

ఫుడ్ సేఫ్టీ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న శ్రీశాంక

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని పలు దుకాణాల్లో సోమవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ ఫ్లయింగ్ స్క్వాడ్ శ్రీశాంక తనిఖీలను నిర్వహించారు. చేగుంటలోని ఎస్ఎస్ మార్ట్, ఎస్‌వీ మార్ట్‌తోపాటు పలు కిరాణ దుకాణాల్లో అమ్ముతున్న వస్తువులను పరిశీలించారు. ఆయా దుకాణాల్లో అల్లం వెల్లుల్లి పేస్ట్‌కు సంబంధించి నాణ్యతను తెలుసుకునేందుకు బాటిళ్లను ల్యాబ్‌కు తరలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా చేగుంటలోని దుకాణాలు పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జిల్లా ఉప వైద్యాధికారి జ్ఞానేశ్వర్ స్థానిక వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు

- పేదరికాన్ని జయించిన రాజ్ కుమార్


రాజ్‌కుమార్

సిద్దిపేటరూరల్: చదువుకు, ప్రతిభకు పేదరికం, సమస్యలు అడ్డురావని నిరూపిస్తూ ఓ విద్యార్థి ఏకంగా ఆరు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచాడు. మండలం పరిధిలోని పుల్లూరు గ్రామానికి చెందిన విద్యార్థి నర్రా రాజ్ కుమార్ పట్టుదలతో చదివి పోటీ ఉద్యోగాలు సాధించాడు. 2019లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించిన రాజ్‌కుమార్, ఆ ఉద్యోగం చేస్తూనే అప్పట్లో వీఆర్‌ఓ పరీక్ష రాసి ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉద్యోగం సాధించాడు. అనంతరం 2021లో గ్రూప్ 4 పరీక్ష రాసి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా మెదక్ జిల్లాలో ఉద్యోగం సాధించాడు. అలాగే, మున్సిపల్ శాఖలో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీస్‌గా పని చేశాడు. 2022లో అప్పటి ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కోసం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉద్యోగాల కోసం వేసిన నోటిఫికేషన్ పరీక్ష రాసి ఉద్యోగం సాధించాడు. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ పత్రాన్ని అందుకున్నాడు. భవిష్యత్ లో ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ విజయానికి తల్లి తండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉందని సంతోషం వ్యక్తం చేశాడు.

పేకాట స్థావరంపై దాడి

దుబ్బాకరూరల్: పేకాట స్థావరంపై పోలీస్‌లు దాడి చేసి నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఘటన మండలంలోని చీకోడ్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ గంగరాజ్ కథనం మేరకు.. గ్రామ శివారులోని కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు, పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నాం. రూ.5,407 నగదు, ఏడు ఫోన్లు, ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నాం. ఇందులో అలుగుల్ల యాదగిరి, వనం పరశురాం, మహ్మద్ అన్వర్, ముత్తయ్యగారి రవి, పెంటం స్వామి, పెంటం దేవరాజ్, సంగోజ్ శ్రావణ్‌సులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి పట్టివేత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మైహోమ్ లేబర్ క్యాంప్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొల్లూరు పోలీసుల కథనం మేరకు.. ఒడిషా రాష్ట్రానికి చెందిన భూభనే అనే వ్యక్తి కొద్ది రోజుల కిందట జీవనోపాధి కోసం తెల్లాపూర్‌కు వలసొచ్చాడు. మైహోమ్ లేబర్‌క్యాంపులో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. సోమవారం స్వగ్రామం నుంచి గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నాం. అతడి నుంచి 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

కారుణ్య గ్రహణం

జీఓ ఉన్నా.. నియామకాలు సున్నా



మెదక్ కలెక్టరేట్: కారుణ్య నియామకాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. 61 ఏళ్ల దాటిన వీఆర్ఏలు తమ వారసులను నియమించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా మా పిల్లలకు పోస్టు ఇస్తారో లేదోనని కొంతమంది వీఆర్ఏలు ఇప్పటికే మంచం పట్టారు. మరికొంత మంది అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వ జీఓ ప్రకారం నియామకాలు చేపట్టాల్సి ఉన్నా అధికారులు ఇప్పటి వరకు నియమించలేదు.

- జిల్లాలో 246 మంది వీఆర్ఏలు
- ఆందోళనతో ఇప్పటికే 30 మంది మృతి
- మంచం పట్టిన మరికొందరు
- ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వానికి వేడుకోలు

వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థల రద్దు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఓ, వీఆర్ఏ వ్యవస్థలను రద్దు చేసింది. అనంతరం వీఆర్ఓ, వీఆర్ఏలను ప్రభుత్వంలోని ఇతర శాఖలకు మళ్లించారు. కాగా వీఆర్ఏలను 24 జూలై 2023లో రెగ్యులర్ చేయడంతోపాటు విద్యార్హతను బట్టి ప్రమోషన్లు కల్పించి జీతాలు పెంచారు. అయితే 61 యేళ్ల దాటిన వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేయలేదు. గ్రామాల్లో వీఆర్ఏలే అన్నీ తామై అధికారులకు, ప్రజలకు వారధులుగా ఉండేవారు. గ్రామంలోని అన్ని వివరాలు వీఆర్ఏలకు తెలిసి ఉండేవి. ఎవరైనా అధికారులు అడిగిన వెంటనే గ్రామానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని వీఆర్ఏలు అందించేవారు. గ్రామాల్లో ఏ కార్యక్రమం చేపట్టిన గ్రామ సేవకులు(మస్కూరీ)లు ప్రజలకు సమాచారమిచ్చి వారిని అధికారుల వద్దకు తీసుకొచ్చేవారు. అలాగే ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా వాటి గురించి ముందుగా గ్రామ సేవకులు ప్రజలకు సమాచారమిచ్చేవారు.

14 నెలలుగా పోరాటం

జిల్లాలో 21 మండలాలు, 469 గ్రామాలు ఉండగా 783 మంది రెగ్యులరైజ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం 61 ఏళ్ల దాటిన వీఆర్ఏలు 246 మంది ఉండగా, ఇందులో 30 మంది కారుణ్య నియామకాల బెంగతో మరణించారు. కానీ ప్రభుత్వం మాత్రం ఇప్పటి వరకు కారుణ్య నియామకాలు చేపట్టలేదు. అయితే కొంతమంది 61 ఏళ్ల దాటిన వీఆర్ఏలు తహసీల్దార్ కార్యాలయాల్లో మొక్కుబడి వేతనంతో సేవలందిస్తున్నారు. 40, 50 ఏళ్లగా మొక్కుబడి జీతంతో నిస్వార్థమైన సేవలందించిన వీఆర్ఏల సేవలను గుర్తించాలని వారసులు కోరుతున్నారు. వారసత్వంగా ఉద్యోగావకాశం లభిస్తుందని వీఆర్ఏ వారసులు 14 నెలలుగా పోరాటం చేస్తున్నారు.


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు (ఫైల్)

జీఓ ఉన్నప్పటికీ అమలేదీ?

ఏళ్ల తరబడి ప్రజలకు అందించిన సేవలను గుర్తించి వీఆర్ఏలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని ప్రభుత్వం 81,85లు జీఓను 24 జూలై 2023లో విడుదల చేసింది. అయితే దీనిపై కొందరు హైకోర్టుకు వెళ్లగా స్టే విధించినట్లు తెలిపారు. అనంతరం 21 నవంబర్ 2023లో కోర్టు స్టే ఎత్తివేసినట్లు వారసులు చెబుతున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కారుణ్య నియామకాలు చేపట్టక తమ కుటుంబాలను మానసిక క్షోభకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎంఏ బీఈడీ చదివాను



మా నాన్న తుపాకి భాగయ్య మా గ్రామ వీఆర్ఏగా పని చేశారు. ఆయన వయస్సు 61 ఏళ్ల దాటింది. రెగ్యులరైజ్ చేయకపోవడంతో కేవలం మొక్కుబడి జీతం ఇస్తున్నారు. ప్రస్తుతం కుటుంబ ఆర్థిక పరిస్థితి ఏం బాగాలేదు. ఎంఏ బీఈడీ చేసిన నేను మా నాన్నకు బదులు సేవలందిస్తున్నాను. ప్రభుత్వం కారుణ్య నియామకం చేపట్టి మా తండ్రి స్థానంలో విద్యార్హతను బట్టి ఉద్యోగం కల్పించాలని వేడుకుంటున్నాను.

– తుపాకి శ్రీరాములు, చిలిపిచెడ్

కుటుంబాన్ని ఆదుకోవాలి



ఏళ్ల తరబడి వీఆర్ఏగా సేవలందిస్తున్నా.. నా వయస్సు 65 ఏళ్లు.. నా తోటి వాళ్లకు రెగ్యులర్ చేయడంతో మంచి జీతం తీసుకుంటున్నారు. నాకు రెగ్యులర్ చేయలేదు. ప్రస్తుతం రూ.11,600 ఇస్తున్నారు. కుటుంబ పోషణకు సరిపోతలేదు. ప్రభుత్వం వారసులకు మా స్థానంలో ఉద్యోగం ఇచ్చి మా కుటుంబాలను ఆదుకోవాలి.

– తలారి రాములు, చేగుంట

వెంటనే నియామకాలు చేపట్టాలి

జీఓ 81,85 ప్రకారం వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టి వీఆర్ఏ కుటుంబాలను ఆదుకోవాలి. ఇప్పటికే 17 మంది తమ వారసులకు ఉద్యోగాలు ఇస్తారో లేదోనని ఆందోళనకు గురై మంచం పట్టారు. వారి మనోవేదనను గుర్తించి నియామకాలు చేపట్టాలి. ప్రభుత్వం స్పందించకుంటే బాధిత కుటుంబాలతో ఆందోళనలు చేపడుతాం.

– లక్ష్మణ్, వీఆర్ఏల బాధితుల సంఘం జిల్లా అధ్యక్షుడు

అవినీతి జరిగితే జరిమానా తప్పదు

- డీఆర్‌డీఓ ఏపీడీ రంగాచార్యులు


వివరాలు తెలుసుకుంటున్న ఏపీడీ రంగచారార్యులు, సిబ్బంది

హవేళిఘణాపూర్(మెదక్): ఒక్క రూపాయి కూలీ అవినీతి జరగకుండా చూడటమే సామాజిక తనిఖీ ఉద్దేశ్యమని డీఆర్‌డీవో ఏపీడీ రంగాచార్యులు అన్నారు. మెదక్ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సామాజిక బృందం నిర్వహించిన తనిఖీల్లో రూ.5 కోట్ల 44లక్షలకు గాను రూ.10,237 అవినీతి జరుగగా, రూ.11,500 పెనాల్టీ విధించినట్లు తెలిపారు. నర్సరీల్లో పెంచిన మొక్కల్లో ఎండిపోయిన మొక్కలు ఉన్నాయని గుర్తించామని, కొన్ని గ్రామాల్లో పనులు చేసినా కూలీలకు పే స్లిప్పులు ఇవ్వలేదని, చనిపోయిన వ్యక్తికి కూడా డబ్బులు చెల్లించినట్లు వివరించారు. పంచాయతీరాజ్ శాఖలో సంబంధించి రూ.3,09 కోట్లు, ఎన్ఆర్ఈజీఎస్‌లో రూ.2 కోట్ల 35 లక్షల 11 వేలు కూలీలు, ఇతర పనులకు చెల్లించినట్లు సామాజిక తనిఖీల్లో తేలిందన్నారు. అవినీతికి పాల్పడినట్లు రుజువైతే జరిమానా విధించి రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డిస్టిక్ విజిలెన్స్ ఆఫీసర్ శ్రీహరి, ఎంపీడీవో రఘు, హెచ్ఆర్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, ఏపీవో వేణుగోపాల్‌రెడ్డి, సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌సీ రమేశ్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పండుగ పూట విషాదం

- బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- న్యాల్‌కల్ మండలంలో గణేశ్‌పూర్‌లో విషాదఛాయలు


ప్రమాదానికి కారణమైన కర్నాటక బస్సు


ఘటనా స్థలంలో దెబ్బతిన్న బైక్

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ మండల పరిధిలోని గణేశ్‌పూర్ గ్రామంలో పండుగ పూట విషాదం నెలకొంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బైక్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు ఆస్పత్రిలో చనిపోయారు. జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంత్, హద్నూర్ ఎస్ఐ రామానాయుడు కథనం మేరకు.. గణేశ్‌పూర్ గ్రామానికి చెందిన గునెల్లి సిద్రాం(70) అతడి అల్లుడు బిరాదర్ జగన్నాథం(40), కూతురు రేణుక(34), మనుమడు వినయ్‌కుమార్(14) జహీరాబాద్-బీదర్ రోడ్డు పక్కన నూతన కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరంతా వ్యవసాయం పనులు చేస్తుండగా సోమవారం సాయంత్రం బైక్‌పై ఇంటికొస్తున్నారు. గ్రామ కాలనీ సమీపంలోకి రాగానే జహీరాబాద్ నుంచి బీదర్ వెళ్తున్న కర్నాటక ప్రాంతానికి చెందిన ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సిద్రాం అక్కడికక్కడే మృతి చెందాడు. అల్లుడు జగనాథం, కూతురు రేణుక, మనుమడు వినయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీపంలో గల బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. బస్సు డ్రైవర్ పరారయ్యాడు. ఘటనా స్థలాన్ని జహీరాబాద్ డీఎస్పీ రామోహన్‌రెడ్డి, జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంత్ పరిశీలించారు. జగన్నాథం-రేణుక దంపతులకు నలుగురు సంతానం. ఒక కుమారుడు, ముగ్గురు ఆడ పిల్లలు. మృతి చెందిన వినయ్‌కుమార్ స్థానిక స్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. పెద్ద కూతురు వైష్ణవి రంజోల్‌లోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి, చిన్న కూతుళ్లు లక్ష్మీ ఏడవ తరగతి, నాగలత మామిడ్గి ప్రభుత్వ పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గణేశ్‌పూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తాత, తండ్రి, అమ్మ, అన్నలను పోగొట్టుకున్న ముగ్గురు చిన్నారులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ, ఎస్ఐ తెలిపారు.

కంకుల మిషన్‌లో పడిన చెయ్యి

- వ్యక్తికి తీవ్ర గాయాలు

మిరుదొడ్డి(దుబ్బాక): మక్క కంకులు పట్టే మిషన్‌లో ప్రమాదవశాత్తు వ్యక్తి చెయ్యి పడటంతో మోచేతి వరకు నుజ్జునుజ్జయిన ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన తోళ్ల చాంద్ పాషా కంకులను సంచులతో నింపి మిషన్‌లో పోస్తున్నాడు. ఈ క్రమంలో పొరపాటున కంకుల సంచి జారి మిషన్‌లో పడిపోయింది. చేతితో సంచిని తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మిషన్‌లో ఇరుక్కుపోయి మోచేతి వరకు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. స్థానికుల సాయంతో చాంద్ పాషాను 108 ద్వారా ఆసుపత్రికి తరలించారు.

కళా ఉత్సవ్ పోటీల్లో కేంద్రీయ విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేటరూరల్: ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్‌లో భాగంగా ఇటీవల కరీంనగర్‌లో జరిగిన కళా ఉత్సవ్ పోటీల్లో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ సోమవారం తెలిపారు. క్లస్టర్ స్థాయిలో నిర్వహించిన గ్రూప్ సింగింగ్ పోటీల్లో ప్రథమ స్థానం, గ్రూప్ డాన్స్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. 21న విశాఖపట్నంలో జరిగే రీజినల్ స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారు.


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు


బతుకమ్మను ఎత్తుకున్న విమలక్క, పక్కన మంత్రి పొన్నం ప్రభాకర్

బహుజన బతుకమ్మ ఉద్యమం కావాలి

అరుణోదయ సాంస్కృతిక అధ్యక్షురాలు విమలక్క

హుస్నాబాద్: బతుకమ్మకు అంతం లేదని, కులం లేదని, అన్ని కులాలు కలిస్తేనే తెలంగాణ బాగుపడుతుందని అరుణోదయ సాంస్కృతిక అధ్యక్షురాలు విమలక్క అన్నారు. హుస్నాబాద్ పట్టణంలో సోమవారం రాత్రి బహుజన బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. పొన్నం సతీమణి మంజుల, మహిళలతో కలిసి విమలక్క బతుకమ్మ ఆట ఆడారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ కేంద్రంగా బహుజన బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విమలక్క మాట్లాడుతూ.. ప్రకృతి అంటే స్త్రీలు అని, ప్రకృతి సహజ సిద్ధంగా లభించే పూలతో తయారు చేసిన బతుకమ్మను బతికిస్తూ మనం బతకాలని విమలక్క అన్నారు. బహుజన బతుకమ్మ ఉత్సవంగా, ఉద్యమంగా కావాలన్నారు. మద్యాన్ని, గంజాయిని గ్రామాలకు రాకుండా చేసినప్పుడే తెలంగాణ బాగుపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కార్యక్రమ నిర్వాహకుడు వీరన్న యాదవ్, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : పొన్నం

హుస్నాబాద్: మహిళలు ఆర్థికంగా ఎదగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం పట్టణంలో మెప్మా పరిధిలో శ్రీభవానీ మహిళా సంఘం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలను అందిస్తోందన్నారు. స్వశక్తి సంఘాల సభ్యులకు స్వయం ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోనే ఇది మొదటి మహిళా క్యాంటీన్‌ను అని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుప్రజ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడు ఆత్మహత్య


రాకేశ్ (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని దాచారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ క్రిష్టారెడ్డి కథనం మేరకు.. గ్రామానికి చెందిన బొర్ర రాజుకు ముగ్గురు కుమారులు. ఆయన వ్యవసాయం చేస్తుండగా కుమారులు కుల వృత్తి చేపలు పడుతూ జీవిస్తున్నారు. ఆదివారం ఇంట్లో నుంచి ఎవరి పనుల నిమిత్తం వారు బయటకు వెళ్లారు. మరో కుమారుడు లక్ష్మణ్ ఇంటి వద్దే ఉండగా గదిలోకి వెళ్లే సరికి వెంటిలేటర్‌కు చిన్నకుమారుడు రాకేశ్(20) ఉరి వేసుకొని కనిపించాడు. మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడాడ్డని మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జీవితంపై విరక్తితో..

మనోహరాబాద్(తూప్రాన్): జీవితంపై విరక్తితో ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండల కేంద్రమైన మనోహరాబాద్‌కు చెందిన తూం నాగయ్య (60) రెండేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో 4న ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన నాగయ్య భార్య చుట్టుపక్కల వారి సాయంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో దూకి..

రామాయంపేట(మెదక్): చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన రామాయంపేటలో వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ బాల్‌రాజు కథనం మేరకు.. పట్టణానికి చెందిన పుట్టి స్వామి (58) ఆదివారం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం పట్టణ శివారులోని కొత్త చెరువులో స్వామి మృతదేహం తేలగా, స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రెండో రోజు హోరాహోరీ

కొనసాగుతున్న రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు


ఫుట్‌బాల్ ఆడుతున్న క్రీడాకారులు

మెదక్‌జోన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు సోమవారం రెండోరోజు కొనసాగాయి. అండర్ 17 బాలికల ఫుట్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి ఫుట్ బాల్ జట్లను రెండు గ్రూపులుగా విభజించి పోటీలను లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహించారు. లీగ్ దశలో అత్యంత ప్రతిభ కనబర్చిన మెదక్, రంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్స్ చేరుకున్నాయి. మొదటి సెమీఫైనల్‌లో రంగారెడ్డి జిల్లా జట్టు నిజామాబాద్ జట్టుపై ఆధిపత్యం చెలాయించి ఒక గోల్ సాధించి ఫైనల్ చేరుకుంది. డీఈఓ రాధాకిషన్, సినీ నిర్మాత, పూర్వ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మామిడి సుధాకర్ రెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, సిద్దార్థ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస చౌదరి సందర్శించి క్రీడాకారులను అభినందించారు. టోర్నమెంట్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేశ్ గంగాల, టోర్నమెంట్ కో ఆర్డినేటర్ నాగరాజు, వ్యాయమ ఉపాధ్యాయులు మాధవ రెడ్డి, చంద్రమోహన్, శ్యామయ్య, రాజేందర్, సత్యం, దేవేందర్ రెడ్డి, రవి, పద్మ, సరోజిని, మహిపాల్, తదితరులు పాల్గొన్నారు. తెలిపారు.

పుట్టినరోజు వేడుకలకు వెళ్లొస్తుండగా..

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


సంతోష్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మనోహరాబాద్‌కు చెందిన మెజోజీ సంతోష్ (36) ఆదివారం దండుపల్లిలో తన మిత్రుడు రవి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నాడు. రాత్రి ఇంటికి నడుచుకుంటూ వెళ్తూ జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని..


కిరణ్ మృతదేహం

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని మల్లారం శివారులో రాజీవ్ రహదారిపై ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు.. ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన కిరణ్ (40) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య స్వగ్రామమైన కోహెడ మండలం వరుకోలు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజుల కిందట గొడవ జరగడంతో కిరణ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలోనే మల్లారం పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాడుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

బైక్ అదుపుతప్పి..

పాపన్నపేట(మెదక్): ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మల్లంపేట శివారులో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధిత వర్గాల కథనం మేరకు.. మండల పరిధిలోని కొత్త లింగాయపల్లి గ్రామానికి చెందిన కోలుకూరి సాయిలు (48) పాపన్నపేటకు వచ్చి తిరిగి ఇంటికెళ్తున్నాడు. మల్లంపేట శివారులోని సంగయ్య గుండ్ల వద్ద వాహనం అదుపుతప్పి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.

చికిత్స పొందుతూ వడ్రంగి

పటాన్‌చెరు టౌన్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వడ్రంగి కార్మికుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అంబర్య కథనం మేరకు.. బీహార్‌కు చెందిన చందన ఠాగూర్(32) పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో ఓ భవనంలో వడ్రంగి పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం మొదటి అంతస్తు నుంచి పైకి ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స నిమిత్తం పటాన్‌చెరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పంట చేనుకు కాపలా వెళ్లి..


నాగవ్వ (ఫైల్)

రామాయంపేట(మెదక్): పంట చేను కాపలాకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి చెందిన ఘటన సోమవారం రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాసుల నాగవ్వ (53) రాత్రి తన కుమారుడి వద్ద భోజనం చేసి పొలం వద్దకు వెళ్లింది. టార్చిలైటు వెలుతురులో వెళ్తూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయింది. ఉదయమైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు దుర్గారాజు పంట చేను వద్దకు వెళ్లగా కనిపించలేదు. పక్కన బావిలో చూడగా తల్లి మృతదేహం కనిపించింది. దుర్గారాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు..


యాదయ్య మృతదేహం

పాపన్నపేట(మెదక్): చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేటలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రొడ్డ యాదయ్య(30) వ్యవసాయంతోపాటు చేపల వేట చేస్తూ జీవనం కొనసాగించేవాడు. సోమవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. ఇతడికి భార్య అనసూయతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.